కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంతో పాటు పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 24 డివిజన్ల పరిధిలో ఉన్న అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, యువకుడైన తనకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

34వ వార్డులో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

- **మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
- **కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి మార్క సతీష్ కుమార్**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని మహిళలకు అందిస్తున్న ఇందిరమ్మ చీరలను బుధవారం 34వ వార్డులో పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి మార్క సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సంధ్యారాణి, యాదవలక్ష్మి , రాజమణి, బాలవ్వ, మున్సిపల్ అధికారి రాజ్యలక్ష్మి తదితరులు వార్డు ప్రజలకు, మహిళా సంఘాల సభ్యులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచి విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరిన్ని పథకాలను అమలు చేయడానికి కృషి చేస్తోందని తెలిపారు. రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు మద్దతుగా నిలుస్తూ, దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా.. పండుగ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు..

- **దసరా వేడుకల ఏర్పాట్లపై మున్సిపల్ అధికారుల ప్రత్యేక దృష్టి**
- **రావణ దహనం ప్రదేశాలను పరిశీలించిన డీఈ ప్రేరణ పాండ**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

సిద్దిపేట పట్టణంలో దసరా పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆదేశాల మేరకు డీఈ ప్రేరణ పాండ రావణ దహనం నిర్వహించే రంగధాంపల్లి, నర్సాపూర్, రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా, సిరిసిల్ల రోడ్డులోని ప్రదేశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పండుగ ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, బారికేడ్ల ఏర్పాటు, ప్రజల రాకపోకలు, భద్రతా చర్యలను సమీక్షించారు. రావణ దహన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. పండుగ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు పృథ్వి, జమీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, వార్డు అధికారులు, జవాన్లు, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకార శంఖారావ సభను జయప్రదం చేయాలి

- **స్వర్ణకార సంఘం జిల్లా కన్వీనర్ ధర్మవరం బ్రహ్మం పిలుపు**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

ఐక్య పోరాటాలతోనే స్వర్ణకారుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం సాధ్యమవుతాయని స్వర్ణకార సంఘం జిల్లా కన్వీనర్ ధర్మవరం బ్రహ్మం అన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న స్వర్ణకార శంఖారావ సభకు జిల్లా వ్యాప్తంగా స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణంలోని శ్రీమహమ్మాయి దేవాలయంలో స్వర్ణకార శంఖారావ సభ గోడపత్రికను రాష్ట్ర కార్యదర్శి చేపూరి వెంకట్ స్వామి, రాష్ట్ర సలహాదారు ఎల్ బ్రహ్మం, శ్రీమహమ్మాయి దేవాలయ కమిటీ అధ్యక్షుడు ధర్మవరం వెంకటనర్సయ్యతో కలిసి స్వర్ణకార సంఘం ప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మవరం బ్రహ్మం మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. స్వర్ణకారులంతా సంఘటితమై తమ బలాన్ని చాటాలని, శంఖారావ సభను విజయవంతం చేసి తమ ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం, శ్రీమహమ్మాయి దేవాలయ ప్రతినిధులు ప్రభాకర్, మహేష్, బ్రహ్మం, నాగరాజు, చారి, నరేందర్, నరేష్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత మాక్ టెస్ట్

- **అక్టోబర్ 16న ఇందుర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహణ**
- **సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్, విఎంఆర్ లాజిక్స్ శిక్షణా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీజీపీఆర్‌బీ) అధికారిక ఎస్ఐ సిలబస్ ఆధారంగా, వాస్తవ పరీక్షల ప్రమాణాలకు అనుగుణంగా ఈ నమూనా పరీక్షను రూపొందించినట్లు పేర్కొన్నారు.

16న పరీక్ష.. ఉదయం 9.30 గంటలకే చేరుకోవాలి..

మొదటి ఎస్ఐ నమూనా పరీక్ష ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఇందుర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9.30 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.

సన్నద్ధతను అంచనా వేసుకునేందుకు అవకాశం

పోలీస్ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్న అభ్యర్థులు తమ పరీక్షా సన్నద్ధతను అంచనా వేసుకోవడానికి ఈ ఉచిత నమూనా పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని కమిషనర్ తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమలోని లోపాలను గుర్తించి, మరింత మెరుగైన ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని రష్మీ పెరుమాళ్ ఆకాంక్షించారు.

జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా చండీహోమం

- **వేద మంత్రోచ్ఛారణల మధ్య విశిష్ట పూజలు.. తొమ్మిది రోజుల పాటు భవానీ స్వాములకు అన్నదానం**



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో బుధవారం నాలుగో రోజు చండీహోమం పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సభ్యులు ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించారు. అనంతరం అక్షయ మెడికల్ ఏజెన్సీ అధినేత, సంఘ సేవకులు బాధం శంకర్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పార్శి ప్రకాష్ గుప్తా, కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతిరోజూ వివిధ అలంకరణలతో, నియమనిష్ఠలతో నిర్వహిస్తూ అమ్మవారికి విశిష్ట పూజలు చేస్తున్నట్లు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో జగద్గిరిగుట్ట ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు భవానీ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి దొంతుల అన్నయ్య గుప్తా, సలహాదారు యెర్రం గౌరయ్య గుప్తా, గోలి శంకరలింగం గుప్తా, గోలి రాజయ్య, యువజన విభాగం నాయకులు పబ్బా నరేష్ గుప్తా, లింగా వేణుగోపాల్, పెద్ది శ్రీధర్, వాస రమాకాంత్, గాదే రమేష్, అమరవాది యాదగిరి, మహిళా విభాగం నాయకురాళ్లు దుండిగల్ల జయ శ్రీ, దొంతుల మేఘమాల, జిల్లా లత, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం
- కోమటి చెరువుపై ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని ఆదేశం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, : బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, ఎర్రచెరువు, మచ్చవానికుంట, నర్సాపురం చెరువు, రంగదాంపల్లి చెరువుల వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోమటి చెరువు వద్ద పారిశుధ్య నిర్వహణలో లోపాలు కనిపించడంతో పర్యాటక శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సద్దుల బతుకమ్మ నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి, చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. కోమటి చెరువు వద్ద ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వెంటనే ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని మున్సిపల్ డీఈ ప్రేరణ పాండాకు ఆదేశించారు. చెరువుల వద్ద మహిళలు, పిల్లలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, చెత్త వేయకుండా డస్ట్‌బిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిమజ్జనం అనంతరం వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, రహదారులు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని, ప్రమాదాలు జరగకుండా పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలు సురక్షితంగా, సంతోషంగా జరుపుకునేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రేరణ పాండా, ఏఈలు పృథ్వీ, జమీల్, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష

- రూ.15 వేల జరిమానా విధిస్తూ సిద్దిపేట మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, : సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు మిట్టపల్లి రాజు (35)కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ సిద్దిపేట మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి వై జయప్రసాద్ తీర్పు వెల్లడించారు. 2017 డిసెంబర్ 17న నమోదైన ఈ కేసులో బాధితురాలిపై అత్యాచారానికి యత్నించి, ఆమె నిరాకరించడంతో తలపై కట్టెతో కొట్టి గాయపరిచినట్లు పోలీసుల కేసు వివరాలు పేర్కొంటున్నాయి. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి, సిద్దిపేట రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సమగ్ర దర్యాప్తు చేపట్టి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సాదుల ఆత్మరాములు న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. సాక్షుల వాంగ్మూలాలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష ఖరారు చేశారు. కేసు విచారణలో ప్రస్తుత సిద్దిపేట రూరల్ సీఐ విద్యాభాస్కర్, ఎస్ఐ డి నవత, ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, సమన్వయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ రవి, భరోసా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ బి దుర్గా, భరోసా న్యాయాధికారి సౌమ్యతో పాటు భరోసా సిబ్బంది సమన్వయంతో సహకారం అందించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అభినందించారు.

మానవ సేవే మాధవ సేవ.. ఉచిత అంబులెన్స్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : మానవ సేవే మాధవ సేవ అని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 130వ డివిజన్ సుభాష్‌నగర్‌కు చెందిన డాక్టర్ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవలను బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ఆపదలో ఉన్న నిరుపేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ నరేందర్ గౌడ్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి, అభాగ్యులకు, నిరుపేదలకు అండగా నిలిచి సేవలందించడం మాధవ సేవతో సమానమని అన్నారు. సమాజంలో సేవాభావంతో ముందుకు వచ్చి ప్రజలకు సహాయపడే ప్రతి ఒక్కరూ అభినందనీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్, సుభాష్‌నగర్ వాసులు లోచారం వెంకట రమణ, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, అడపా శేషు, విష్ణువర్ధన్, శివతేజ, గుబ్బల తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

- గిరినగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : తెలంగాణ మహిళలు ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజలుగా సమర్పించే గొప్ప సంప్రదాయ పండుగ బతుకమ్మ అని అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సరస్వతి నీరజ అన్నారు. బుధవారం బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా జగద్గిరిగుట్ట పరిధిలోని గిరినగర్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ మండపం వద్ద స్థానిక బతుకమ్మ మహిళా గ్రూప్ సభ్యులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో మహిళలు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి నీరజ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా ప్రకృతి పట్ల ప్రేమను, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను ఈ పండుగ చాటిచెబుతుందని అన్నారు. ఈ వేడుకల్లో బతుకమ్మ గ్రూప్ మహిళలు ఏ. ధనలక్ష్మి , శోభ, రాధిక, ఎస్. అరుణ, కే. వాణి, కే. లావణ్య, ఎన్. పద్మ, జె. పద్మ, జె. ప్రియాంక, శ్వేత, రమాదేవి, స్వాతి, సరస్వతితో పాటు లక్ష్మి , పలువురు యువతులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రకృతితో మమేకం.. మహిళా సాధికారతకు నిదర్శనం..
- తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ జీవన విధానానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఆటపాటలతో జరుపుకునే ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత స్పష్టంగా కనిపిస్తాయని వివరించారు. బతుకమ్మలో ఉపయోగించే అనేక పూలకు ఔషధ గుణాలు ఉండటంతోపాటు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ చాటుతుందని తెలిపారు. ప్రకృతిని పూజించడం, పర్యావరణాన్ని గౌరవించడం తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. మహిళలే బతుకమ్మలను తయారు చేసి, పూజించి, ఉత్సవాలను ముందుండి నిర్వహించడం మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషించాయని, ఆటపాటల ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రపంచానికి చాటిచెప్పామని గుర్తుచేశారు. కులమతాలు, ధనిక పేద తేడాలు లేకుండా అందరూ ఒకచోట చేరి బతుకమ్మ ఆడటం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ పండుగ స్ఫూర్తితో తెలంగాణ గ్రామీణ సంస్కృతిని కాపాడుకోవాలని, రైతు సంస్కృతికి జీవనాధారమైన చెరువులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పూల సాగు చేసే రైతులను ప్రోత్సహించి, వారికి తగిన సహకారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ, మహిళల గౌరవం, ఐక్యతను చాటే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని నీరుడి స్వామి ఆకాంక్షించారు.

దుర్గామాతను దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు నరేందర్ రెడ్డి

- పద్మానగర్ ఫేజ్–2, ఎం.ఎన్. రెడ్డి నగర్ వెస్ట్ లో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు – ప్రత్యేక పూజలు, అన్నదానంలో పాల్గొన్న నాయకులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : పద్మానగర్ ఫేజ్–2, ఎం.ఎన్. రెడ్డి నగర్ వెస్ట్‌లో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం అక్కడ ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ యాదగిరి యాదవ్, బీఆర్ విశాల్, రాముడు యాదవ్, మురళి, జోగు నరసింహ, నర్సింహారావు యాదవ్, కుమార్ యాదవ్, మల్లేష్ గౌడ్ తదితర ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నరేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దుర్గామాత ఆశీస్సులు పొందారు.

ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు

బీఆర్ఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు నూతన గృహ ప్రవేశం సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు సోమేశ్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్ పాల్గొని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

జర్నలిస్టు శివకుమార్ కుమారుడి నామకరణ వేడుక

హాజరైన మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య

చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :



జర్నలిస్టు అన్నిమల్లె శివకుమార్ కుమారుడి నామకరణ మహోత్సవం బుధవారం సిద్దిపేట పట్టణంలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ వేడుకకు మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్నగారి శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, అనంతసాగర్ మాజీ సర్పంచ్ మెట్ల శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్కి వెంకటయ్య చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖులు శివకుమార్ కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. తమ ఇంటి వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన అతిథులకు శివకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నామకరణ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య ఆనందోత్సాహాలతో సాగింది.

వైశ్య సంఘం అభివృద్ధి చెందాలి.. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- **జగద్గిరిగుట్ట వైశ్య సంఘం హోమంలో ముఖ్య అతిథిగా జె.కె. శేఖర్ యాదవ్**

జగద్గిరిగుట్ట ప్రతినిధి, అక్టోబర్ 14, : జగద్గిరిగుట్ట వైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైశ్య భవనంలో నిర్వహించిన హోమ కార్యక్రమానికి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, యువ నాయకుడు జె.కె. శేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జె.కె. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు. జగద్గిరిగుట్ట వైశ్య సంఘం మరింత అభివృద్ధి చెందాలని, సంఘం సభ్యులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట వైశ్య సంఘం అధ్యక్షుడు ప్రకాష్ గుప్తా, తేరాల శ్రీనివాస్ గుప్తా, అన్నయ్య, రమణ, ఉపేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.



రోగుల అవస్థలు పట్టవా..!?

సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా ల్యాబ్ సిబ్బంది విధులు

- **అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తే ఆందోళనకు గురిచేసే పరిస్థితులేంటని ఆగ్రహం**
- **గౌరవప్రదమైన సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందికి లేదా అని ప్రశ్నిస్తున్న రోగులు**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, : అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి వస్తున్న రోగులకు సిబ్బంది నుంచి సానుకూల స్పందన, సహకారం అందాల్సిన అవసరం ఉంది. అయితే ఆసుపత్రిలోని ప్రయోగశాల సిబ్బంది వ్యవహారశైలిపై రోగుల నుండి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే అనారోగ్యంతో అవస్థలు పడుతున్న రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి బాధలు మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులు పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య భరోసా కల్పించే కేంద్రాలు. ఇక్కడికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో సేవలు అందించడం, మర్యాదగా మాట్లాడటం, పరీక్షల విషయంలో అవసరమైన సహకారం అందించడం సిబ్బంది బాధ్యత. ముఖ్యంగా రక్త పరీక్షల కోసం వచ్చే రోగుల పట్ల ఓపికగా వ్యవహరించి, వారి పరిస్థితిని అర్థం చేసుకొని సేవలందించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే దాని ప్రభావం నేరుగా రోగులపై పడుతుంది.



సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ టెస్ట్ కోసం వచ్చిన మహిళకు ఫోన్ మాట్లాడుతూ బ్లడ్ తీస్తున్న ల్యాబ్ టెక్నీషియన్.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి. ప్రయోగశాలలో పరీక్షల నిర్వహణ, సిబ్బంది పనితీరు, రోగులతో వ్యవహరించే తీరు వంటి అంశాలను పరిశీలించాలి. రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు వస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా విచారించి, వాస్తవాలు నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలి.

ప్రజలకు వైద్యం హక్కు.. నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడం బాధ్యత..

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఎవరి దయాదాక్షిణ్యాలపైనా ఆధారపడాల్సిన అవసరం లేదు. ప్రజాధనంతో నడిచే ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందడం ప్రాథమిక అవసరం. అనారోగ్యంతో వచ్చిన వారిని మరింత ఆందోళనకు గురిచేసే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. రోగుల బాధలను అర్థం చేసుకొని సేవ చేయడమే వైద్య వ్యవస్థకు నిజమైన గౌరవం. సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఎదురవుతున్న సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, ప్రయోగశాల సేవలను మెరుగుపరిచి, ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు (రోగులు) కోరుతున్నారు.

దూలపల్లిలో గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



- **నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్**

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : దూలపల్లిలోని రామాలయం సమీపంలో దొడ్ల రాములమ్మ, దొడ్ల శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహంలో బుధవారం నిర్వహించిన గృహప్రవేశ వేడుకకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమానులు, వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజే శారు. వారి కుటుంబం సుఖసం తోషా లతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శివకుమార్ గౌడ్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, డప్పు నరేందర్, నాగరాజ్ యాదవ్, సాయి యాదవ్, రాజేష్ గౌడ్, చందర్ నాయక్, రాము యాదవ్, అలీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన చోటే అంబేడ్కర్ విగ్రహం పునఃప్రతిష్ఠ

- **జీవో 18ను రద్దు చేయాలి అంబేడ్కర్ విగ్రహాల విషయంలో వివక్ష తగదు**
- **అనుమతుల పేరుతో విగ్రహాల తొలగింపును సహించేది లేదు**
- **డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, : అనుమతుల పేరుతో తొలగించిన డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో అదే స్థలంలో తిరిగి పునఃప్రతిష్ఠించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని, ఇలాంటి చర్యలు రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సిద్దిపేట జిల్లా సభ్యుడు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్నగారి శంకర్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ బౌద్ధం స్వీకరించిన అక్టోబర్ 14వ తేదీని పురస్కరించుకొని దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో బౌద్ధ ఆచారాల ప్రకారం విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కులమతాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు, సామాజిక న్యాయం సాధించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని అనుమతుల పేరుతో తొలగించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక మంది మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, అంబేడ్కర్ విగ్రహాల విషయంలోనే అనుమతుల నిబంధనలను ప్రత్యేకంగా ప్రస్తావించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ ఎదుట అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంగణానికి మరింత గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభతో పాటు పార్లమెంటు ప్రాంగణంలోనూ అంబేడ్కర్ విగ్రహాలకు ఉన్న ప్రాధాన్యతను అధికారులు గుర్తించాలని సూచించారు.అంబేడ్కర్ ఆశయాలు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజల హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విగ్రహాల ఏర్పాటులో వివక్షకు తావులేకుండా చూడాలని, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి అమలులో ఉన్న జీవో 18ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో అంబేడ్కర్ విగ్రహాలను తొలగించే చర్యలకు అధికారులు, పోలీసులు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ముత్యంపేటలో తొలగించిన చోటే విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించడం ద్వారా అంబేడ్కర్ ఆశయాల పట్ల తమ నిబద్ధతను చాటుకున్నామని శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధిష్టి సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు, ఎమ్మార్పీఎస్ రాయపోల్ మండల అధ్యక్షుడు అయ్యగల్ల రవి, మాల మహానాడు దౌల్తాబాద్, రాయపోల్ మండలాల అధ్యక్షులు బొల్లం రాజేష్, సోక్కం స్వామి, నాయకులు గజ్వేల్ రామచంద్రం, పుట్ట రాజు, ఉషనగల శ్రీనివాస్, వెంకటేష్, శ్రీకాంత్, పరశురాములు, కరుణాకర్, ప్రవీణ్, మహేష్, స్వామి, ప్రశాంత్, నర్సింలు, రాజయ్య, దుర్గయ్య, మీన, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- **బాలానగర్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐలకు వినతిపత్రాలు అందజేత**

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : రంగారెడ్డినగర్ ప్రధాన రహదారిపై నెలకొన్న ట్రాఫిక్ సమస్యను తక్షణమే పరిష్కరించి, బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పరిష వేణు కోరారు. రంగారెడ్డినగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మద్యం దుకాణాల ముందు కొనుగోలుదారులు ద్విచక్ర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, వివేకానంద విగ్రహం నుంచి రంగారెడ్డినగర్ బస్తీలోకి వెళ్లే రహదారిపై పలు పరిశ్రమలకు సంబంధించిన భారీ వాహనాల రాకపోకలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ట్రాఫిక్ సమస్య కారణంగా అత్యవసర సేవలకు చెందిన అంబులెన్సులు సైతం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మహిళలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడంతో పాటు, భారీ వాహనాల రాకపోకలపై తగిన నియంత్రణ విధించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ మేరకు బుధవారం బాలానగర్, జీడిమెట్ల ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు పరిష వేణు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు లావణ్య, చంద్రప్రకాష్, లక్ష్మీ, ఓం ప్రకాష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాలో నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

- **అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ**
- **అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**
- **కలెక్టర్ కట్టా హైమావతి**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించ నున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కట్టా హైమావతి తెలిపారు. హుస్నాబాద్ (32), సిద్దిపేట (33), దుబ్బాక (41), గజ్వేల్ (42) అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణలో భాగంగా గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన, నకిలీ ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించబడినవారు తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువతతో పాటు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు నమోదు కాని వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాల్లో ఫారం–6 సమర్పించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అర్హత కలిగిన వారికి నవంబర్ 9న ప్రచురించే తుది ఓటరు జాబితాలో పేరు చేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో

అక్టోబర్ 15, 16 తేదీల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉండి ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు సహకరిస్తారని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా ఈ శిబిరాల్లో పాల్గొనాలని కోరారు.

అర్హుల పేర్లు ఉండాలి.. అనర్హుల పేర్లు తొలగాలి..

అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి, అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదనే లక్ష్యంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించు కోవడంతో పాటు, అర్హత కలిగిన వారు కొత్తగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.



పోచమ్మ తల్లి ఆలయంలో ఘనంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహాదేవపురం డివిజన్ పోచమ్మ బస్తీలో ఉన్న శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో బుధవారం నాలుగో రోజు దుర్గామాత అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, జర్నలిస్ట్ యూనియన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్, బస్తీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి మహావీర్, యూత్ సభ్యులు, చిన్నారులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.



సిద్దిపేట జిల్లాలో 28 ప్రభుత్వ పాఠశాలలకు గ్రంథాలయాలు

- రూ.7.56 లక్షల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం వెల్లడి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తక పఠనాన్ని చేరువ చేయడంతో పాటు, వారిలో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో సిద్దిపేట జిల్లాలోని 28 ప్రభుత్వ పాఠశాలల్లో నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.7.56 లక్షల నిధులు మంజూరు చేసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించి గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 28 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి నిధులు కేటాయించినట్లు వివరించారు. ఒక్కో పాఠశాలలో గ్రంథాలయ గది మరమ్మతుల కోసం రూ.15 వేలు, 12 నెలల పాటు పత్రికల కొనుగోలుకు రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.27 వేల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ లెక్కన 28 పాఠశాలలకు కలిపి రూ.7,56,000 మంజూరయ్యాయని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆమోదంతో ఆయా పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ చేసినట్లు వెల్లడించారు. అక్టోబర్ 13న ఈ నిధులు సంబంధిత కమిటీల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. గ్రంథాలయాల ఏర్పాటుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆయా పాఠశాలల కమిటీలను కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు బాటలు

పాఠశాలల్లో గ్రంథాలయాలు అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థుల్లో పుస్తక పఠన అలవాటు పెరగడంతో పాటు, సాధారణ జ్ఞానం విస్తరిస్తుందని చంద్రం ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు దోహదపడేలా సంబంధిత కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌తో మన్నె రాజు మర్యాదపూర్వక భేటీ

- స్థానిక సమస్యల పరిష్కారం, డివిజన్ అభివృద్ధిపై చర్చ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, :

మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు బుధవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు స్థానిక సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి, ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఎస్.ఆర్. నాయక్ నగర్ అధ్యక్షుడు బాబీ, మాజీ అధ్యక్షుడు టీటీకే శ్రీను, కిషోర్, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నవాబ్‌పేటలో ఘనంగా ప్రజావీరుడు పండుగ సాయన్న కాంస్య విగ్రహావిష్కరణ

- పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయం.. భావితరాలకు ఆయన చరిత్రను అందించాలి: ఆగం పాండు ముదిరాజ్

నవాబ్‌పేట, అక్టోబర్ 14, :

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్ర పరిధిలోని తీగలపల్లి గ్రామంలో ప్రజావీరుడు, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు హాజరై పండుగ సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, బీసీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, జడ్పర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎర్ర శేఖర్, డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పేదల పక్షాన పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిజాం పాలన కాలంలో పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధైర్యశాలి పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలు, సేవలు, ధైర్యసాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆగం పాండు ముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయమని, ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మహనీయుల చరిత్రను యువతకు పరిచయం చేయడంతో పాటు ముదిరాజ్ సమాజం, బహుజన వర్గాల అభివృద్ధికి విద్యను ప్రధాన ఆయుధంగా మలుచుకోవాలని సూచించారు. విద్య, ఐక్యత, సామాజిక చైతన్యంతోనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు.



పలువురు నాయకుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సంజీవ్ ముదిరాజ్, ఎన్.పి. వెంకటేష్, అందె బాబన్న, చొప్పరి శంకర్, మాడమోని నరసింహ, శ్రీనివాస్, హరలింగం, రమాదేవి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. పండుగ సాయన్న విగ్రహావిష్కరణతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజావీరుడి చరిత్రను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు.

దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాధవరెడ్డి, నరేందర్ రెడ్డి



- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు.. మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, :

జీడిమెట్ల 132వ డివిజన్ (286) పరిధిలోని సుచిత్ర–వెన్నెలగడ్డ చెరువు వద్ద దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక నాయకులు గోలి రమేష్ గుప్తా ఆహ్వానం మేరకు బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు సంపత్ మాధవరెడ్డి, వీరారెడ్డి నరేందర్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దుర్గామాత అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దసరా నవరాత్రుల సందర్భంగా అన్నప్రసాద వితరణ

- పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 14, :

దసరా నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకొని అల్లాపూర్‌లోని శివాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం లక్ష్మణ్ గౌడ్ పర్యవేక్షణలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ



దసరా నవరాత్రులు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి పవిత్రమైన పర్వదినాల్లో అన్నదానం చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి పేదలకు, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. శివాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ గౌడ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వాజిద్ పాషా, మస్తాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, తిరుపతి, నరసింహ యాదవ్, అబ్దుల్లా, జమీర్, వాసు, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

దమ్మపేట, అక్టోబర్ 14, :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను బుధవారం సాయంత్రం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా వేడుకలు సందడిగా సాగాయి. డీఏవీ పాఠశాల విద్యార్థిని వనమాల యువతేశ్వరి, యువతులతో కలిసి రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, చప్పట్లు కొడుతూ ఆడే నృత్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమకున్న ఆసక్తిని చాటిచెప్పారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, మహిళల గౌరవానికి, ప్రకృతిపై మనకున్న ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మద్దినేని మురళీ, సిబ్బంది రెవెన్యూ ఇన్స్పెక్టర్ బిక్షమయ్య, జీపీఓ కుంజా పాపయ్య, దమ్మపేట గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి, మందలపల్లి గ్రామ సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చింతలపాటి మురళీ, దమ్మపేట కాంగ్రెస్ పార్టీ



నాయకులు పగడాల రాంబాబు, గుత్తి ఉష, పగడాల పద్మావతి, జయ, వనమాల వసంతమాల తదితరులు పాల్గొన్నారు.

శంభిపూర్ రాజు నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న భౌరంపేట్ బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నేతలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభిపూర్‌లో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు నూతన గృహ ప్రవేశ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి భౌరంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు హాజరై, శంభిపూర్ రాజుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ వేడుక ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, భౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చింత వెంకట్, గడిల బాబు, గడిల చింటూ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ చే అవార్డు అందుకున్న కాల్వ రేణుశ్రీ

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 14, :

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ హైదరాబాద్ డైరెక్టర్ వి శ్రీకాంత్ అధ్యక్షతన మానక్ మహోత్సవ ప్రపంచ ప్రమాణాల దినోత్సవ అక్టోబర్ 14 రోజు వేడుకలు మనోహర్ బేగంపేట హోటల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు ప్రతి నెల నిర్వహించే జాతీయ స్థాయి క్విజ్ పోటీలలో తెలంగాణ రాష్ట్రంలోని బీఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్ సభ్యులందరిలోనూ పీఎంశ్రీ బాలికల ఉన్నత పాఠశాల, దుబ్బాకకు చెందిన పదవ తరగతి విద్యార్థిని కాల్వ రేణుశ్రీ ఎక్కువ సార్లు బహుమతులు గెలుచుకున్నందుకు గుర్తింపుగా ఉత్తమ బ్యూరో ఆఫ్ ఇండియన్ నాణ్యత ప్రమాణాల క్లబ్ మెంబర్ గా అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవం–2026 వేడుకల్లో పదో తరగతి కాల్వ రేణుశ్రీ బహుమతి అందజేసి సత్కరించారు. పాఠశాల విద్యార్థులు



ఈ కార్యక్రమంలో వస్తు నాణ్యత ప్రమాణాలను పెంపొందించే స్కిట్టు, నృత్య ప్రదర్శన చేసిన రేణు శ్రీ, తన్వి, రుచిత, భావన, చందన, విద్య, శివాని, నిత్యశ్రీ, శృతి, శ్రీ వర్ష లను మంత్రిగారు ముఖ్య ప్రదర్శన చేసిన విద్యార్థులను ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్నం భూపాల్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ మెంటార్ బండారు రజిత స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ , 2024 సంవత్సరం నుండి క్లబ్ కార్యక్రమాలు , స్కిట్టులు, అవగాహన సదస్సులు, జాతీయస్థాయి క్విజ్ ప్రైజ్ మనీ పొందడంలో నిరంతరము కృషి చేసినందుకు దక్కిన ఫలితం అని అన్నారు. రజిత శ్రీనుశ్రీ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు.



కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 14, :

ఎన్ఆర్‌సీ గార్డెన్స్‌లో జరిగిన కేశమోని వారి కుటుంబ వివాహ వేడుకకు మిత్రులు ఒగ్గు మల్లేష్ యాదవ్ ఆహ్వానం మేరకు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు శ్రీచందన, రాకేష్ కుమార్‌లను అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

త్రిశూల్ టూర్స్ అండ్ ట్రెక్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 14, :

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ 6వ ఫేజ్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన 'త్రిశూల్ టూర్స్ అండ్ ట్రెక్స్' పర్యాటక కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ యజమానులు సాయి కృష్ణారెడ్డి, రామ్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, నాగేష్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందజేత



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 14, :

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసి ద్వారా అల్లాపూర్ డివిజన్‌కు చెందిన తాడిపెట్టి పావని తండ్రి టి నాగరాజుకి రూ. 2 లక్షల విలువైన చెక్కును బుధవారం అందజేశారు.

ఎస్ ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ఎమ్మెల్యే దిశానిర్దేశం

- బిఆర్ఎస్ నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన మాధవరం కృష్ణారావు



కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 14, :

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అంశాలపై పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులుకృషి చేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి, పరిష్కారానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఏవైనా సందేహాలు లేదా ఇబ్బందులు ఉంటే తన కార్యాలయాన్నిసంప్రదించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు.

గురువులకు ఘన సన్మానం.. పాత జ్ఞాపకాలతో సందడి..

- 2000-2001 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దుబ్బాక ప్రతినిధి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 14, :

కాలం మారినా.. దూరాలు పెరిగినా.. చెక్కుచెదరని స్నేహబంధాలకు, గురువుల పట్ల గౌరవానికి రుద్రారం గ్రామంలో బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేదికగా నిలిచింది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఎన్నో ఏళ్ల తర్వాత ఒకచోట చేరి సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి, పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దీర్ఘకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకుంటూ, విద్యార్థి దశలో చేసిన అల్లరి, ఉపాధ్యాయుల బోధనలు, పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత వివిధ రంగాల్లో స్థిరపడిన తమ జీవిత ప్రయాణాలను పరస్పరం పంచుకున్నారు. కుటుంబాల యోగక్షేమాలను తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ముందుకు సాగేందుకు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువులు నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువలు తమ జీవితాలకు ఇప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గురువుల ఆశీస్సులు పొందడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. విద్యార్థి



దశలో ఏర్పడిన స్నేహబంధాలు జీవితాంతం కొనసాగుతాయని, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచడంతో పాటు స్నేహితుల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పూర్వ విద్యార్థులు అన్నారు. నిత్య జీవితంలోని బిజీ పనుల మధ్య అందరూ ఒకచోట చేరి ఆనందంగా గడపడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, సిద్ధి రాములు, యాదయ్య, వెంకట నరసింహులు, చంద్రం, లక్ష్మీ నర్సింలు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్ వర్క్‌షాప్

- నటరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహణ.. పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14, :

కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. కన్వీనర్ నటరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ఎస్. మల్లారెడ్డి, జిల్లా కన్వీనర్ మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్. వాసు, శివాజీతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్ మెంట్‌కు సంబంధించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేశారు.



ఈ నెల 15, 16న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలోని వివరాల్లో తప్పులు ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ



పరిశీలించుకోవాలని, అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కోరారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- ఎమ్మెల్యేతో కలిసి 6 లక్షల చెక్కు అందజేసిన మంత్రి

జగిత్యాల జిల్లా జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14, :

రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబం చేసిన విజ్ఞప్తిపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకంగా



చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో, సీఎం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అట్టి ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి అనారోగ్యానికి గురై కాళ్ళు చేతులు పోగొట్టున్న అబ్బాడి శ్రీనివాస్ ని పరామర్శించి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, జిల్లా మండల నాయకులు ఎన్ఆర్ఐ సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో వర్క్ షీట్ల పంపిణీ

హెచ్ఎం హరికృష్ణ ప్రసాద్

చొప్పదండి/కొడిమ్యాల,అక్టోబర్ 14,:

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని నూకపెల్లి ప్రాథమిక పాఠశాల ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు బుధవారం రోజున దసరా సెలవుల సందర్భంగా విద్యార్థులు ఖాళీగా ఉండకుండా తెలుగు పాఠ్యాంశానికి సంబంధించిన ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి తెలుగులో వర్ణమాల సరళ అక్షరాలు, పదాలు, వాక్యాలు గుర్తించడం అవగాహన చేసుకోవడం, చదవడం, రాయడం, జతపరచడం వంటి కృత్యాలను హెచ్ఎం హరికృష్ణ ప్రసాద్ ఇంటి వద్ద తల్లిదండ్రుల సమక్షంలో అందించడం జరిగింది. కావున విద్యార్థులు ఈ దసరా సెలవులను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






కలెక్టర్ ను కలిసిన అదనపు కలెక్టర్ ప్రసూనాంబ

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 14, :

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎన్. ప్రసూనాంబ బుధవారం బాధ్యతలు స్వీకరించగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బాధ్యతలను సమర్థవంతంగా ప్రజలతోమమేకమై నిర్వర్తించాలని జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ అన్నారు. అనంతరం జిల్లా పరిపాలన అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.



తెలంగాణ ఉద్యమ ఆది గురువు
కొండా లక్ష్మణ్

నేడు బాపూజీ జయంతి

భారత స్వాతంత్ర్య పోరాటంలో , ముల్కీ ఉద్యమంలో , నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో , తెలంగాణ 1969 నాటి తొలి, ఇటీవలి మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ. ఏక కాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజాఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర వితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. అలనాటి నిజాం సంస్థానంలో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. చిన్నతనాన తల్లిని కోల్పోగా, ప్రాథమిక విద్య ఆసిఫా బాద్ లో, హైదరాబాద్ లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయ వాద వృత్తి చేపట్టాడు. ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించి, గెలిపించే వాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన , దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువు పై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతుడుగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలన పై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి, తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి ఆక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్‌గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు. ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం చేసుకున్నాడు. 1973 లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన , ఇందిరా గాంధీ ఒప్పుకున్నా, నాటి హోం మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరా వు కు ముఖ్య మంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్ సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించు కోగా, 2002 లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా , కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా , జలదృశ్యం లోనే అంత్య క్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీ గా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను , జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్‌లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలు పెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ప్రాచీన చారిత్రక సాక్ష్యాల ఆత్మఘోష

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహ వంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకులలో అక్కడక్కడ నిక్షిప్తమై యున్న చరిత్ర కొంతవరకు వెలుగు లోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్ట మొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెన వేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చిత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్ట లేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజా ప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్చామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజక వర్గం లోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాత వాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం - కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించ బడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు - చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం అవిభక్త రాష్ట్రంలో తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరో వైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించు కోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చరిత్రకు చిరునామా.. నిర్లక్ష్యానికి నిలువుటద్దం!

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



తెలంగాణ చరిత్రలో ఓ అపురూప అధ్యాయం.. శాతవాహనుల ఆనవాళ్లను తన గర్భంలో దాచుకున్న నేల.. వేల ఏళ్ల నాటి నాణేలు, పురావస్తు ఆధారాలతో చరిత్ర పరిశోధకులను ఆకర్షించిన ప్రాంతం.. అదే కోటిలింగాల. ఒకప్పుడు రాజరిక వైభవానికి కేంద్రంగా వెలుగొందిన ఈ ప్రాచీన ప్రాంతం నేడు గోదావరి కోత, పరిరక్షణ లోపం, పూర్తిస్థాయి పర్యాటక అభివృద్ధి జరగకపోవడం వంటి సమస్యల మధ్య తన ఉనికిని కాపాడుకునేందుకు ఎదురుచూస్తోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కోటిలింగాల చారిత్రక ప్రాధాన్యం, పరిరక్షణ మరోసారి చర్చకు వస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ ప్రాంతానికి ప్రాచీన చరిత్ర ఉంది. అందులో కోటిలింగాలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం జగిత్యాల జిల్లా వెల్గటూరు మండల పరిధిలో, గోదావరి-పెద్దవాగు సంగమ ప్రాంతంలో ఉన్న కోటిలింగాల.. శాతవాహనుల తొలి రాజకీయ కేంద్రాల్లో ఒకటిగా పురావస్తు పరిశోధనల్లో ప్రాధాన్యం పొందింది. ఇక్కడ నిర్వహించిన తవ్వకాల్లో లభించిన కోట అవశేషాలు, నాణేలు, మట్టిపాత్రలు, బ్రాహ్మీ లిపి ఆధారాలు ఈ ప్రాంత ప్రాచీనతను తెలియజేస్తున్నాయి. శాతవాహనుల ఆవిర్భావం, తొలి పాలకుల క్రమం, వారి ప్రారంభ రాజధాని వంటి అంశాలపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, కోటిలింగాలలో లభించిన నాణేల ఆధారాలు శాతవాహనుల తొలి చరిత్రను అధ్యయనం చేయడంలో అత్యంత కీలకమైనవిగా పురావస్తు పరిశోధకులు పరిగణిస్తున్నారు. కోటిలింగాల చరిత్ర వెలుగులోకి రావడంలో నాణేలది కీలక పాత్ర. ధర్మపురికి చెందిన చారిత్రక పరిశోధకుడు, పురావస్తు శాఖలో శాసన వ్యాఖ్యాతగా పనిచేసిన సంగనభట్ల నరహరిశర్మ ఈ ప్రాంతంలో అనేక పురాతన నాణేలను సేకరించి పురావస్తు శాఖకు అందించారు. వాటిలో శాతవాహనుల తొలి దశకు సంబంధించినవిగా భావించే నాణేలు ఉండటంతో కోటిలింగాల ప్రాధాన్యం మరింత పెరిగింది. 'రజో శాతవాహ', 'రజో సాతకనిస' వంటి బ్రాహ్మీ లిపి గుర్తులతో కూడిన నాణేలు సహా వివిధ పాలకులకు సంబంధించిన నాణేలు ఈ ప్రాంతంలో వెలుగుచూశాయి. శుంగులు, కాణ్వులు, శాతవాహనుల కాలానికి సంబంధించిన నాణేలపై పురావస్తు పరిశోధకులు అధ్యయనాలు చేశారు. ఈ ఆధారాలే తెలంగాణలో శాతవాహనుల తొలి రాజకీయ ప్రస్థానాన్ని అర్థం చేసుకునేందుకు కోటిలింగాలను కీలక కేంద్రంగా నిలిపాయి. కోటిలింగాల అంటే కేవలం నాణేల చరిత్ర మాత్రమే కాదు. ఇక్కడి పుట్టకోట గోడలు, ప్రాచీన నివాస ఆనవాళ్లు, సమీప ప్రాంతాల్లో కనిపించిన బౌద్ధ అవశేషాలు, జైన సంప్రదాయానికి సంబంధించిన గుర్తులు ఈ ప్రాంతానికి మరింత చారిత్రక వైవిధ్యాన్ని తీసుకొచ్చాయి. సమీపంలోని పాపాయిగాం గుట్ట ప్రాంతంలో బౌద్ధ ఆనవాళ్లు గుర్తించినట్లు పరిశోధనలు పేర్కొంటున్నాయి. గ్రామంలోని కోటీశ్వర ఆలయం మరో ఆకర్షణ. గోదావరి ఒడ్డున కనిపించే శిల్పాలు, ఆలయ నిర్మాణ శైలి మధ్యయుగ చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఒకే ప్రాంతంలో ప్రాచీన రాజకీయ చరిత్ర, బౌద్ధ-జైన ఆనవాళ్లు, ఆలయ సంప్రదాయం కనిపించడం కోటిలింగాల ప్రత్యేకత. ఇంతటి చారిత్రక సంపద ఉన్న ప్రాంతానికి ఇప్పుడు ప్రధాన సమస్య పరిరక్షణ. గోదావరి ఒడ్డున ఉండటంతో ఏటా వరదలు, ఒడ్డు కోత ప్రభావం పురావస్తు ప్రాంతంపై పడుతోందన్న ఆందోళన చాలా కాలంగా వ్యక్తమవుతోంది. మరిన్ని శాస్త్రీయ తవ్వకాలు చేపడితే కొత్త చారిత్రక ఆధారాలు బయటపడే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నప్పటికీ, సమగ్ర తవ్వకాలు, సంరక్షణ చర్యలు మరింత విస్తృతంగా చేపట్టాలన్న డిమాండ్ కొనసాగుతోంది. గోదావరి నుంచి చారిత్రక ప్రాంతాన్ని కాపాడేందుకు రక్షణ గోడ నిర్మించాలన్న ప్రతిపాదన కూడా ఏళ్లుగా వినిపిస్తోంది. ఆలంపూర్‌లో చారిత్రక కట్టడాలను పరిరక్షించిన తరహాలో కోటిలింగాల పురావస్తు ప్రాంతానికీ శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని చరిత్రాభిమానులు కోరుతున్నారు. కోటిలింగాలను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గతంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. వివిధ దశల్లో పర్యాటక సౌకర్యాల కల్పనకు ప్రయత్నాలు జరిగాయి. 2018లో పర్యాటకులను ఆకర్షించేందుకు 'శాతకర్ణి', 'పులోమావి' పేర్లతో బోట్లను ప్రారంభించారు. స్పీడ్ బోటును కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. హరిత హోటల్ తదితర పర్యాటక సదుపాయాల అభివృద్ధిపైనా చర్యలు చేపట్టారు. అయితే కోటిలింగాల చారిత్రక ప్రాధాన్యానికి తగిన స్థాయిలో సమగ్ర అభివృద్ధి, పురావస్తు పరిరక్షణ ఇంకా జరగాల్సి ఉందన్న అభిప్రాయం స్థానికులు, చరిత్రాభిమానుల్లో ఉంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం అంటే కొత్త పర్యాటక ప్రాంతాలను ప్రచారం చేయడమే కాదు.. ఉన్న చారిత్రక సంపదను భావితరాలకు అందించడం కూడా. కోటిలింగాలలో శాస్త్రీయ తవ్వకాలను విస్తరించడం, గోదావరి కోత నుంచి పురావస్తు ప్రాంతాన్ని రక్షించడం, మ్యూజియం ఏర్పాటు, సందర్శకులకు చరిత్రను వివరించే కేంద్రం, మెరుగైన రహదారులు, రవాణా, వసతి సదుపాయాలు కల్పిస్తే ఈ ప్రాంతాన్ని తెలంగాణలోనే ప్రముఖ చారిత్రక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. శాతవాహనుల చరిత్రను తన ఒడిలో దాచుకున్న కోటిలింగాల కోరుతున్నది భారీ హామీలు కాదు.. తన చరిత్రను చెరిగిపోకుండా కాపాడే శాశ్వత చర్యలు. ప్రపంచ పర్యాటక దినోత్సవం వేళైనా ఆ దిశగా అడుగులు పడితేనే ఈ ప్రాచీన నేలకు నిజమైన గౌరవం దక్కుతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఆస్ట్రేలియా పర్యటనకు ఇంగ్లండ్ జట్లు ప్రకటన

లండన్, అక్టోబరు 13 : పాకిస్థాన్‌తో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో ఘన విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు ఇప్పుడు ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతోంది. నవంబరులో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌ల కోసం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) జట్లను ప్రకటించింది. రెండు ఫార్మాట్లలోనూ హ్యారీ బ్రూక్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌ల కోసం సెలెక్టర్లు వేర్వేరుగా జట్లను ఎంపిక చేశారు.ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో పేసర్ జోఫ్రా ఆర్చర్‌కు చోటు దక్కింది. గాయం నుంచి కోలుకున్న జాకబ్ బెథెల్ వన్డే, టీ20 రెండు జట్లలోనూ స్థానం సంపాదించాడు. మరోవైపు యువ ఆటగాళ్లు ఎడీ జాక్, థామస్ రే తొలిసారి టీ20 జట్టులోకి ఎంపికయ్యారు. అయితే, శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న ఇంగ్లండ్ విధ్వంసక ఓపెనర్ జోస్ బట్లర్ ఈ పర్యటనకు దూరమయ్యాడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య నవంబరు 13న పెర్త్‌లో తొలి వన్డే



జరగనుంది. నవంబరు 15న అడిలైడ్ ఓవల్‌లో రెండో వన్డే, నవంబరు 18న మూడో వన్డే నిర్వహించనున్నారు. అనంతరం నవంబరు 21 నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో రెండు ఫార్మాట్లలోనూ రాణించి సిరీస్‌లను కైవసం చేసుకోవాలని ఇంగ్లండ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంగ్లండ్ వన్డే జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, జో రూట్, హెన్రీ క్రొకొంబె, సామ్ కరన్, లియామ్ దాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, టామ్ బ్యాంటన్.

ఇంగ్లండ్ టీ20 జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), టామ్ బ్యాంటన్, జాకబ్ బెథెల్, జేమ్స్ కోల్స్, జోర్డన్ కాక్స్, హెన్రీ క్రొకొంబె, సామ్ కరన్, లియామ్ దాసన్, అనేరిన్ డొనాల్డ్, ఎడీ జాక్, విల్ జాక్స్, జేమీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, థామస్ రే, ఫిల్ సాల్ట్, ల్యూక్ వుడ్.

దక్షిణాఫ్రికాపై ఆసీస్ ఘన విజయం

డర్బన్, అక్టోబరు 13: ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు సొంతగడ్డపై భారీ ఎదురుదెబ్బ తగిలింది. గత రెండేళ్లుగా స్వదేశంలో టెస్టుల్లో ఓటమి ఎరుగని సఫారీ జట్టుకు ఆస్ట్రేలియా బ్రేక్ వేసింది. డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ 214 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగో ఇన్నింగ్స్‌లో జోష్ హేజిల్‌వుడ్ ఆరు వికెట్లతో చెలరేగడంతో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ కుప్పకూలింది. ఎడెన్ మార్క్‌రమ్ (75) అర్ధశతకంతో పోరాడినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. ఆస్ట్రేలియా నిర్దేశించిన 421 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఐదో రోజు ఆట ప్రారంభానికి దక్షిణాఫ్రికాకు ఇంకా 319 పరుగులు అవసరమయ్యాయి. చేతిలో ఆరు వికెట్లు ఉండటంతో గెలుపుపై ఆశలు పెట్టుకున్న సఫారీలకు ఆసీస్ బౌలర్లు గట్టి షాకిచ్చారు. వియాన్ ముల్డర్ (29)ను హేజిల్‌వుడ్ ఔట్ చేయగా, కైలీ వెర్రెయిన్ (1)ను మ్యాట్ రెన్‌షా పెవిలియన్‌కు పంపాడు. కీలక వికెట్లు వరుసగా పడటంతో దక్షిణాఫ్రికాపై ఒత్తిడి పెరిగింది. మార్క్‌రమ్ మాత్రం క్రీజులో నిలబడి పరుగులు సాధిస్తూ జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించాడు. అతడికి మార్కో యాన్సెన్ (35) కొంతసేపు అండగా నిలిచాడు. అయితే హేజిల్‌వుడ్ ఒకే ఓవర్లో యాన్సెన్, సైమన్ హార్మర్ (0)లను ఔట్ చేయడంతో సఫారీల పతనం వేగంగా సాగింది. అప్పటివరకు 155 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా, ఆ తర్వాత 201 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. మార్క్‌రమ్ అర్ధశతకంతో చివరి వరకు పోరాడినా ఆసీస్ బౌలర్లను నిలువరించలేకపోయాడు. కీలక సమయంలో



అతడిని మిచెల్ స్టార్క్ ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా విజయంపై మిగిలిన ఆశలు కూడా ఆవిరయ్యాయి. చివరి వికెట్‌గా అన్రిచ్ నోర్జిని హేజిల్‌వుడ్ పెవిలియన్‌కు పంపడంతో ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్ 206 పరుగుల వద్ద ముగిసింది. హేజిల్‌వుడ్ 49 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టగా, రెన్‌షా రెండు వికెట్లు సాధించాడు.

కింగ్స్‌మీడ్ మైదానంలో ఆస్ట్రేలియాకు ఇది వరుసగా నాలుగో టెస్టు విజయం. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబ బవుమాకు స్వదేశంలో ఎదురైన తొలి టెస్టు ఓటమి ఇదే. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు అక్టోబరు 18న జరగనుంది. తొలి టెస్టులో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని దక్షిణాఫ్రికా భావిస్తుండగా, విజయ పరంపరను కొనసాగించాలని ఆస్ట్రేలియా లక్ష్యంగా పెట్టుకుంది.

హేజిల్‌వుడ్ దెబ్బకు దక్షిణాఫ్రికా విలవిల

డర్బన్, అక్టోబరు 13: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఓటమి అంచున నిలిచింది. ప్రత్యర్థి నిర్దేశించిన 421 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆతిథ్య జట్టు బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోతున్నారు. నాలుగో రోజు నుంచి పట్టుదలగా ఆడుతున్న ఎడెన్ మార్క్‌రమ్ (75 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తున్నా, మరోవైపు సహకరించే బ్యాటర్లు లేకపోవడంతో జట్టు కష్టాల్లో పడింది. ఐదో రోజు తొలి సెషన్‌లో ఆసీస్ బౌలర్లు విజృంభించడంతో దక్షిణాఫ్రికా విజయావకాశాలు మరింత సన్నగిల్లాయి. మార్క్‌రమ్ క్రీజులో పాతుకుపోయి పరుగులు సాధించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆస్ట్రేలియా బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కీలక దెబ్బ కొట్టాడు. అప్పటికే మూడు వికెట్లు తీసిన అతడు, ఒకే ఓవర్లో మార్కో యాన్సెన్ (35), సైమన్ హార్మర్ (0)లను పెవిలియన్‌కు పంపాడు. అంతకుముందు కైలీ వెర్రెయిన్ (1)ను రెన్‌షా ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికాపై ఒత్తిడి పెరిగింది. ఐదు వికెట్ల ఘనత సాధించిన హేజిల్‌వుడ్.. ఆసీస్ విజయానికి మార్గం సుగమం చేశాడు. ఒక దశలో 155 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా, హేజిల్‌వుడ్ ధాటికి 201 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం మార్క్‌రమ్‌కు జతగా కేశవ్ మహరాజ్ క్రీజులో ఉన్నాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో 200కుపైగా బంతులను ఎదుర్కొన్న మార్క్‌రమ్ అర్ధశతకంతో పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే దక్షిణాఫ్రికా విజయానికి ఇంకా 220 పరుగులు అవసరం కాగా, ఆస్ట్రేలియా రెండు వికెట్లు తీస్తే విజయం సాధిస్తుంది. పరిస్థితులను చూస్తే ఆసీస్ గెలుపు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా ఓటమిని తప్పించుకోవాలంటే మార్క్‌రమ్ అసాధారణ ఇన్నింగ్స్ ఆడటంతోపాటు చివరి వికెట్ల నుంచి గట్టి సహకారం లభించాల్సి ఉంది.

భువీకి జట్టులో చోటు.. అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 13: భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ఈ నెల 22 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న ఐదు టీ20ల సిరీస్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అతడిని ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ భువనేశ్వర్‌పై ప్రశంసలు కురిపించాడు. తిరిగి జాతీయ జట్టులోకి రావాలనే లక్ష్యంతో కాకుండా, తన ఆటపై దృష్టి పెట్టి ముందుకు సాగడం వల్లే అతడికి ఈ అవకాశం దక్కిందని పేర్కొన్నాడు.భువనేశ్వర్ కుమార్ తిరిగి భారత జట్టులోకి రావాలని ప్రత్యేకంగా ప్రణాళికలు వేసుకుని ఉండకపోవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. జాతీయ జట్టులో చోటు కోసం ఆరాటపడకుండా, తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగాడని తెలిపాడు. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున మెరుగ్గా ఆడటంపైనే దృష్టి పెట్టాడని వివరించాడు. భువీకి ఇప్పుడు భారత జట్టులో చోటు దక్కడం అతడి కృషికి లభించిన ప్రతిఫలమని అశ్విన్ పేర్కొన్నాడు. అయితే ఆ ఫలితం కోసం అతడు ప్రత్యేకంగా వెతుక్కుంటూ వెళ్లలేదని, తన పని తాను చేసుకుంటూ పోయాడని చెప్పాడు. చివరకు



అతడి ప్రదర్శనే జాతీయ జట్టులోకి తిరిగి వచ్చే అవకాశాన్ని తెచ్చిపెట్టిందని ప్రశంసించాడు.యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ప్రతిభపైనా అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. అతడు అసాధారణ ప్రతిభావంతుడని, క్రికెట్ అతడి రక్తంలోనే ఉందని వ్యాఖ్యానించాడు. వైభవ్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందనడంలో సందేహం లేదని పేర్కొంటూనే, అవకాశాల కోసం ఓపికగా ఎదురుచూడటం కూడా ముఖ్యమని సూచించాడు. ప్రస్తుతం సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా ఆడుతున్న నేపథ్యంలో వైభవ్ తనకు వచ్చే అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఆ సమయాన్ని ఆస్వాదించాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ప్రతిభ ఉన్నంత మాత్రాన వెంటనే అవకాశాలు వస్తాయని భావించకూడదని తెలిపాడు. సంజు శాంసన్ కెరీర్‌ను ఉదాహరణగా ప్రస్తావించిన అశ్విన్.. అతడు జాతీయ జట్టులో నిలకడగా అవకాశాలు పొందేందుకు చాలా కాలం ఎదురుచూడాల్సి వచ్చిందని గుర్తుచేశాడు. ఒకప్పుడు పరిమితంగా వచ్చిన అవకాశాలు, ఆ తర్వాత వరుసగా లభించాయని వివరించాడు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన అవకాశాలు ఒకే టీ20 ప్రపంచకప్ సమయంలో లభించాయని పేర్కొన్నాడు. క్రికెట్‌లో ప్రతిభతోపాటు సహనం కూడా అవసరమని అశ్విన్ చెప్పాడు. సరైన సమయం వచ్చినప్పుడు అవకాశాన్ని అందిపుచ్చుకోవడమే కీలకమని యువ ఆటగాళ్లకు సూచించాడు. భువనేశ్వర్ పునరాగమనం, సంజు శాంసన్ ప్రయాణం యువ క్రికెటర్లకు మంచి ఉదాహరణలని ఆయన వ్యాఖ్యల సారాంశం.



వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

దుబాయ్, అక్టోబరు 13: భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.

టీమిండియాలోకి జాకిబ్ నబీ..

కారు కొనుగోలుపై చర్చ!

గువాహటి, అక్టోబరు 13 : జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ జాకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన జాకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు. భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో జాకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్



కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున కొంతకాలం ఆడాడు. అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.

400 కుటుంబాలకు రష్మిక ఆహార సాయం!



హైదరాబాద్, అక్టోబరు 14 : నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. సినిమాల్లో నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. పేద కుటుంబాలకు నిత్యావసర ఆహార పదార్థాలను అందించే లక్ష్యంతో 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ' పేరుతో సేవా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సమాచారం. ఈ కార్యక్రమం ద్వారా దక్షిణ భారతదేశంలోని ఎనిమిది ప్రాంతాల్లో 400 కుటుంబాలకు ఆహార కిట్లను అందిస్తున్నారు. 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ'లో భాగంగా ఒక్కో కుటుంబానికి పెద్ద మొత్తంలో నిత్యావసర ఆహార పదార్థాలను అందిస్తున్నారు. ఒక్కో కిట్‌లో 75 కిలోల బియ్యం, 10 కిలోల గోధుమ పిండి, 15 కిలోల వివిధ రకాల పప్పులు, 10 లీటర్ల వంట నూనెతో పాటు రాగులు, మసాలా దినుసులు, టీ తదితర వస్తువులు ఉన్నాయి. రోజువారీ ఆహార అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సాయం కొంతకాలం పాటు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఒక ప్రాంతానికే పరిమితం చేయకుండా దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, అనంతపురం, బెంగళూరు, కొచ్చి, చెన్నై, కొడగు, విజయవాడ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఆహార కిట్లను అందిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. రష్మిక చేపట్టిన ఈ ప్రయత్నంపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాను నటించిన 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రకు, తన నిజ జీవితానికి పోలికలు ఉన్నాయా అని చాలామంది అడుగుతున్నారని రష్మిక తెలిపారు. ఈ కార్యక్రమం కూడా ఆ పోలికల్లో ఒకటేనని ఆమె చెప్పినట్లు సమాచారం. "నేను ఎప్పటి నుంచో ఇలాగే ఉంటున్నాను. జయమ్మ పాత్ర కూడా ఇలాగే ఉంటుంది. మీరు నాకు ఇస్తున్న ప్రేమకు ప్రతిగా ఇలాంటి పనులు చేస్తూనే ఉంటాను" అని ఆమె పేర్కొన్నారు. అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సామాజిక సేవ ద్వారా స్పందించాలని రష్మిక భావిస్తున్నట్లు ఆమె వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. మరోవైపు, విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'రణబాలి' చిత్రంలో రష్మిక కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా అక్టోబరు 15న విడుదల కానున్నట్లు ప్రచారంలో ఉంది. రష్మిక నటనతో పాటు సేవా కార్యక్రమం కూడా ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.



వాయిదా దిశగా విశ్వక్ సేన్ 'కల్ట్'?

హైదరాబాద్, అక్టోబరు 14 : టాలీవుడ్ యువ కథానాయకుడు విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న థ్రిల్లర్ చిత్రం 'కల్ట్'పై మొదటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. భారతీయ తెరపై స్లాషర్ థ్రిల్లర్‌గా, పెద్దలకు మాత్రమే అనుమతించే 'ఏ' ధ్రువీకరణతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రకటించడంతో అంచనాలు పెరిగాయి. అయితే అక్టోబరు చివరి వారంలో విడుదల చేస్తామని గతంలో వెల్లడించిన చిత్రబృందం నుంచి ఇటీవల పెద్దగా సమాచారం లేకపోవడంతో సినిమా అనుకున్న సమయానికి వస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 'కల్ట్'ను అక్టోబరు చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం గతంలో ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో ఓ సమాచారం పంచుకున్నప్పటికీ, ఆ తర్వాత ప్రచార కార్యక్రమాలపై స్పష్టత కనిపించడం లేదు. సాధారణంగా విడుదలకు దగ్గరపడే సినిమాలకు వరుసగా ప్రచార చిత్రాలు, టీజర్లు, ట్రైలర్లు విడుదల చేస్తుంటారు. కానీ 'కల్ట్' విషయంలో అలాంటి సందడి లేకపోవడంతో విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయనే చర్చ మొదలైంది. అయితే సినిమా వాయిదా పడినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. నటుడిగా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటున్న విశ్వక్ సేన్.. 'కల్ట్'తో మరోసారి దర్శకుడిగా తన ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. స్లాషర్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తారక్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కథాంశం, చిత్రీకరణ శైలి కారణంగా ఇప్పటికే ఈ సినిమాపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. విడుదల తేదీపై కొనసాగుతున్న సందిగ్ధతకు చిత్రబృందం అధికారిక ప్రకటనతోనే తెరపడనుంది. దీంతో విశ్వక్ సేన్ అభిమానులు తదుపరి సమాచారం కోసం ఎదురుచూస్తున్నారు.

బాలీవుడ్‌లో హిందూ సంప్రదాయాలపై

వివక్ష ఉందా?

ముంబై, అక్టోబరు 14 : ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్ సినీ పరిశ్రమలో తనకు ఎదురైన అనుభవాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ యూట్యూబర్ రన్వీర్ అల్లాబాదియా నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. హిందూ సంప్రదాయాలను పాటించే విషయంలో పరిశ్రమలో కొందరి వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సంప్రదాయాలను అనుసరించినందుకు తాను ఎగతాళికి గురైన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. తాను బొట్టు పెట్టుకోవడం, చేతికి పవిత్రమైన దారాలు కట్టుకోవడం చూసి పరిశ్రమలో కొందరు విచిత్రంగా స్పందించారని ఏక్తా కపూర్ చెప్పినట్లు సమాచారం. తన సంప్రదాయాలను పాటించినందుకు కొందరు తనను 'వింత మనిషి', 'తాంత్రికురాలు' అంటూ వ్యాఖ్యానించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత విశ్వాసాలు, ఆచారాలను గౌరవించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. పాశ్చాత్య సంస్కృతికి సంబంధించిన కల్పిత కథలు, యానిమేషన్ చిత్రాలను సినీ పరిశ్రమలోని కొందరు ఆస్వాదిస్తారని, అదే సమయంలో భారతీయ సంస్కృతి, జానపద కథలు, హిందూ సంప్రదాయాల ప్రస్తావన వచ్చినప్పుడు భిన్నంగా స్పందిస్తారని ఏక్తా వ్యాఖ్యానించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ వైఖరిని ఆమె పక్షపాత ధోరణిగా అభివర్ణించినట్లు తెలుస్తోంది. ఒకసారి తాను గుడికి వెళ్లిన తర్వాత నేరుగా ఓ క్లబ్‌కు వెళ్లినప్పుడు కొందరు ఆశ్చర్యపోయారని ఏక్తా గుర్తుచేసుకున్నట్లు సమాచారం. మతపరమైన విశ్వాసాలను పాటిస్తూనే ఆధునిక జీవనశైలిని అనుసరించడంలో తప్పేముందని ఆమె అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. సంప్రదాయాలను గౌరవించడం, ఆధునికంగా జీవించడం పరస్పర విరుద్ధమైన విషయాలు కావని ఆమె వ్యాఖ్యల సారాంశం. ఏక్తా కపూర్ వ్యాఖ్యలు బాలీవుడ్‌లో వ్యక్తిగత విశ్వాసాలు, సంప్రదాయాల పట్ల చూపించే వైఖరిపై చర్చకు దారితీస్తున్నాయి. అయితే, పరిశ్రమ మొత్తాన్ని ఒకే విధంగా చూడకుండా, ఆమె వివరించిన అనుభవాలను వ్యక్తిగత అభిప్రాయాలుగా పరిగణించాల్సి ఉంటుంది.



విలన్‌గా అదరగొడుతున్న తెలుగమ్మాయి..

గాయత్రి సింహాద్రి!

హైదరాబాద్, అక్టోబరు 14 : తెలుగు బుల్లితెరపై తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి గాయత్రి సింహాద్రి ప్రస్తుతం చర్చల్లో నిలుస్తున్నారు. విజయవాడకు చెందిన ఈ తెలుగమ్మాయి హీరోయిన్‌గా వెండితెరపై గుర్తింపు తెచ్చుకోవాలని సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. అయితే బుల్లితెరపై ప్రతినాయిక పాత్రతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. నటనతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకుంటున్న ఫొటోలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. గాయత్రి సింహాద్రి 'మ్యాడ్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించారు. అయితే 'కార్తీక దీపం- ఇది నవ వసంతం' ధారావాహికలో జ్యోత్స్న పాత్ర ఆమెకు మరింత గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ సీరియల్‌లో ప్రతినాయికగా నటిస్తూ తన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాత్రకు తగ్గ హావభావాలు, మాటతీరు, తెరపై కనిపించే ప్రత్యేకమైన నటనతో అభిమానులను సంపాదించుకున్నారు. ధారావాహికలో జ్యోత్స్న పాత్రలో చోటుచేసుకున్న మార్పులు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సూరజ్ తనకు నమ్మకద్రోహం చేశాడనే నేపథ్యంలో జ్యోత్స్న పాత్రలో భావోద్వేగపరమైన మార్పులు కనిపిస్తున్నాయి. గతంలో ప్రతినాయికగా కనిపించిన ఆమె.. ఇప్పుడు ప్రేమ కోసం తపించే అమ్మాయిగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ భిన్నమైన భావోద్వేగాలను గాయత్రి తన నటనతో పండిస్తున్నారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. బుల్లితెరపై సంప్రదాయబద్ధమైన పాత్రలో కనిపించే గాయత్రి సింహాద్రి.. నిజ జీవితంలో ఆధునిక దుస్తుల్లో తీసుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ అభిమానులను అలరిస్తున్నారు. ఆమె తాజా ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. నటనతో పాటు తన వ్యక్తిగత శైలితోనూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం బుల్లితెరపై మంచి ఆదరణ పొందుతున్న గాయత్రి సింహాద్రికి భవిష్యత్తులో వెండితెరపై మరిన్ని అవకాశాలు వస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తున్న ఈ విజయవాడ అమ్మాయి తదుపరి ఎలాంటి ప్రాజెక్టులతో అలరిస్తారో చూడాలి.

'ఇరుముడి'తో గుర్తింపు..

ఈ చిన్నారి ఎవరో తెలుసా?



హైదరాబాద్, అక్టోబరు 14 : మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' సినిమాలో ఓ చిన్నారి తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రంలో గురుస్వామి సాయికుమార్ కుమార్తె గాయత్రి పాత్రలో కనిపించిన సామ్ తన అభినయంతో ప్రశంసలు అందుకుంటోంది. గతంలో పలు సినిమాల్లో చిన్న పాత్రలు చేసినప్పటికీ, ఈ చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు లభించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సామ్ గతంలో 'ప్రసన్న వదనం', 'డాకు మహారాజ్', 'మ్యాడ్ స్క్వేర్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించింది. అయితే అప్పట్లో ఆమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. 'ఇరుముడి'లో గాయత్రి పాత్రతో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. సినిమాలో ఆమె కనిపించే సన్నివేశాలు, సహజమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా కనిపించారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కూడా నటించింది. తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు సాయికుమార్ కుమార్తె గాయత్రి పాత్రలో సామ్ తనదైన నటనతో ప్రత్యేకంగా నిలిచింది. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే సామ్ తాజాగా లంగా ఓణీలో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. సంప్రదాయ దుస్తుల్లో అందంగా కనిపిస్తున్న ఆమె ఫొటోలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. పలువురు అభిమానులు ఆమె రూపాన్ని, ఫొటోలను ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. 'ఇరుముడి' తర్వాత సామ్ సామాజిక మాధ్యమాల్లోనూ మరింత మంది దృష్టిని ఆకర్షిస్తోంది. చిన్న పాత్రలతో తన ప్రయాణాన్ని కొనసాగించిన సామ్‌కు 'ఇరుముడి' మంచి గుర్తింపును తీసుకొచ్చింది. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని చిత్రాల్లో కనిపిస్తుందేమో చూడాలి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com